

ఎండన పడకుండా జాగ్రత్త..!
వేసవి దృష్ట్యా..పాఠశాలలకు ఒంటిపూట తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి.
- 8లో



కర్బూజా తోటలో ఘీం'కరి'ంపు
జియ్యమ్మవలస మండలం వెంకటరాజపురం-బిత్రపాడు పరిసర పంటపొలాల్లో ఉన్న కర్బూజా తోటలో మూడురోజుల నుంచి ఏనుగులు తిష్ట వేశాయి.
- 8లో

విజ్జీస్టేడియంలో టెన్నిస్ శిక్షణ
విజయనగరం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం విజ్జీస్టేడియంలో టెన్నిస్ శిక్షణ పునఃప్రారంభించనున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ సోమవారం తెలిపారు. స్టేడియంలోని సింథటిక్ ప్లేఫీల్డ్‌లో టెన్నిస్‌కోచ్ ఎల్.సత్యగోపాల్ నేతృత్వంలో శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పూర్తి వివరాలకు కోచ్ సెల్:7989941222 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ (సా.)	బుధ (ఉ.)
6:15	4:26

ప్రగతిపథంలో
పార్వతీపురం మన్యం

జిల్లాల పునర్విభజనలో భాగంగా నాలుగు నియోజకవర్గాలు.. 15 మండలాలు.. 2,729.64 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం.. 9,25,340 లక్షల జనాభాతో ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోంది. సగానికి పైబడి గిరిజన జనాభాతో కూడిన జిల్లా అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. అధికారులు, పాలకుల సమష్టికృషి ఫలిస్తోంది. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. విద్య, వైద్యం, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో స్పష్టమైన ప్రగతి కనిపిస్తోంది.

- అందుబాటులోకి ప్రభుత్వ సేవలు
- చేరువైన వైద్యం
- ప్రజలకు దగ్గరైన జిల్లా కేంద్రం
- అందుబాటులో అధికారులు, పాలకులు

పార్వతీపురంటౌన్: జిల్లాల పునర్విభజన జరిగి మంగళవారానికి (ఏప్రిల్ 4, 2022) ఏడాది పూర్తవుతుంది. ప్రజలకు పాలన చేరువచేయడం, అధికారుల పర్యవేక్షణ, జవాబుదారీతనం పెంచడం, వనరుల సద్వినియోగం, పారదర్శక పాలనే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లోక్‌సభ నియోజక వర్గాలవారీగా జిల్లాలను పునర్విభజన చేసింది. దీనిలో భాగంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని ప్రాంతాలతో కలిపి కొత్తగా పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భవించింది. నాలుగు నియోజకవర్గాలు, 15 మండలాలతో ఏర్పడిన జిల్లాకు కలెక్టర్‌గా నిషాంత్‌కుమార్, జేసీగా ఒ.ఆనంద్, ఎస్పీగా విద్యాసాగర్‌నాయుడు బాధ్యతలు చేపట్టి ఏడాదిగా జిల్లా అభివృద్ధికి కృషిచేస్తున్నారు. ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేల సూచనలకు అనుగుణంగా జిల్లాను ప్రగతిపట్టాలపై నడిపిస్తున్నారు. గిరిజనుల ఆర్థిక సంక్షేమానికి బాటలు వేస్తున్నారు. పార్వతీపురం, సాలూరు మున్సిపాల్టీ, పాలకొండ నగర పంచాయతీతో పాటు రెండు ఐటీడీఏల పరిధిలోని ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారు. జిల్లా పరిధి చిన్నదిగా ఉండడంతో నిరంతరం పర్యటిస్తున్నారు.

అన్నింటా ముందంజ..
జిల్లా చిన్నదిగా ఉండడంతో ప్రతి గ్రామంపైనా అధికారులకు స్పష్టమైన అవగాహన ఉంది. సహజ వనరులు సద్వినియోగమయ్యేలే చక్కని ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నారు. పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నారు. గిరిజన ప్రజలకు విద్య, వైద్యం చేరువ చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.600 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. మరో రూ.49.70కోట్లతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టింది. రూ.వెయ్యికోట్ల వ్యయంతో గిరిశిఖర గ్రామాలకు రోడ్లువేసే ప్రణాళికలను రూపొందించింది. ఇప్పటికే కొన్నిరోడ్ల పనులు చకచకా సాగుతున్నాయి. మరికొన్ని పూర్తయ్యాయి. ఉపాధిహామీ పనుల కల్పన, ఇళ్ల నిర్మాణాల్లో జిల్లా ముందంజలో ఉంది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 24,743 ఇళ్లకు 9,070 ఇళ్లనిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

సిగ్నల్ సమస్యలకు చెక్
సచివాలయ వ్యవస్థతో ఊరికో సచివాలయాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తోంది. ఇందులో భాగంగా కొండశిఖర గ్రామాల్లోనూ సిగ్నల్ సమస్యలు లేకుండా సెల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, ఐడియా, జియో సంస్థలు సెల్ టవర్ల ఏర్పాటులో నిమగ్నమయ్యాయి.
- నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులకు మన్యం జిల్లా పేరు. ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి మార్కెట్ చేసేందుకు జిల్లా యంత్రాంగం నడుంబిగించింది. వన్‌ధన్ వికాస కేంద్రాలను ప్రోత్సహిస్తోంది. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో పామాయిల్ కంపెనీలు వెలిశాయి.



పార్వతీపురం మన్యం జిల్లా మ్యాప్

త్వరితగతిన పరిష్కారం

ప్రజలకు పరిపాలన మరింత చేరువయ్యేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు చేరువలోనే ఉండడంతో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోంది. జిల్లాకు రూ.600కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, 49.5 కోట్లతో మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టి ప్రజలకు వైద్యాన్ని చేరువ చేశారు.
- అలజంగి జోగారావు, ఎమ్మెల్యే, పార్వతీపురం

అభివృద్ధికి నాంది

పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం నాంది పలికింది. ఏడాది కాలంలో వివిధ పథకాల కింద నిధులు సమకూర్చడంతో అభివృద్ధిపనులు వేగవంతమయ్యాయి. మన్యం జిల్లా విద్య, వైద్యం, వ్యవసాయ పరంగా పురోగతి సాధించింది. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన చేరువైంది. జిల్లా అభివృద్ధికి మరింత కృషిచేస్తాం.
- విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే, పాలకొండ

పాలన మరింత చేరువ...

కొత్త జిల్లాతో పాలన చేరువైంది. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలన్నీ ఊరిలోనే అందుతున్నాయి. ప్రతి పైసా సద్వినియోగమవుతోంది. గిరిజన ప్రజలకు లబ్ధిచేకూరుతోంది. కురుపాం నియోజకవర్గంలో రూ.900 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టాం. రూ.150 కోట్ల అంచనా వ్యయంతో 105 ఎకరాల విస్తీర్ణంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యే, కురుపాం

దూరం తగ్గింది

కొత్త జిల్లాతో ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. జిల్లా కేంద్రం చేరువైంది. గతంలో స్పందన కార్యక్రమానికి విజయనగరం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు దగ్గరలో ఉన్న పార్వతీపురం కలెక్టరేట్‌కు వెళ్లి సమస్యలు విన్నవించుకునే అవకాశం లభించింది. అధికారులు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గిరిజన ప్రాంతాల ప్రగతికి శ్రద్ధచూపుతున్నారు. ప్రజలకు సుపరిపాలన చేరువైంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సాలూరు నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. జిల్లాలోని ఒక మెడికల్ కళాశాల, రెండు మల్టీస్పెషాల్టీ ఆస్పత్రుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంక్షేమ పాలనపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నాం.
- పీడిక రాజన్నదొర, గిరిజన శాఖామంత్రి, ఉప ముఖ్యమంత్రి

న్యూస్‌రీల్

మిషన్‌వాత్సల్యకు దరఖాస్తుల ఆహ్వానం
- ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ విజయగౌరి


పార్వతీపురంటౌన్: మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ కె.విజయగౌరి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో సోమవారం మాట్లాడారు. అనాథలు, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు నెలకు రూ.4వేలు సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయన్నారు. 2019లో వ్యాప్తిచెందిన కోవిడ్ సమయంలో తల్లిదండ్రులు చనిపోయి ఎంతోమంది పిల్లలు అభాగ్యులుగా, అనాథులుగా మారడంతో వారికి ఆర్థిక భరోసా స్పాన్సర్ షిప్‌ను ప్రవేశపెట్టాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తోందని, జిల్లా బాలల రక్షణ విభాగం దీనిని పర్యవేక్షిస్తుందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 5లోగా అనాథపిల్లలందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బాడీబిల్డింగ్‌లో బంగారుపతకం

గోల్డ్‌మెడల్ సాధించిన పట్టణానికి చెందిన సంతోష్

పార్వతీపురంటౌన్: హర్యానాలో ఆదివారం జరిగిన 16వ మిస్టర్ ఇండియా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పార్వతీపురం యువకుడు సంతోష్‌కుమార్ సత్తాచూపాడు. బంగారు పతకంతో మెరిశాడు. ఏడో తరగతి చదువుకున్న సంతోష్ పార్వతీపురం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేస్తూ.. బాడీ బిల్డింగ్‌పై మక్కువతో కఠోరసాధన చేశాడు. ఇప్పటివరకు జాతీయస్థాయిలో 40కి పైగా పతకాలు అందుకున్న యువకుడిపై పట్టణవాసులు అభినందనల జల్లు కురిపిస్తున్నారు.

పంట నష్టాలు గుర్తించండి

బాలేరులో కుళ్లిన మొక్కజొన్న పొత్తులను జేడీ రాబర్ట్‌పాల్‌కు చూపుతున్న ఎంపీటీసీ చంద్రశేఖర్

భామిని: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పూర్తి స్థాయిగా నమోదు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు కె.రాబర్ట్‌పాల్ ఆదేశించారు. భామిని మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బాలేరు, సొలికిరి, దిమ్మిడిజోల గ్రామాల పరిధిలో దెబ్బతిన్న మొక్కజొన్న, నువ్వు తదితర పంటలను పాలకొండ వ్యవసాయ సంచాలకులు కె.రత్నకుమారితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ-క్రాప్ చేసిన పంట నష్ట పోయిన రైతుకు విధిగా పరిహారం అందజేస్తామని చెప్పారు. మండలంలో 90 ఎకరాల్లో మొక్కజొన్న, 40 ఎకరాల్లో పెసర, మినప పంటలు, 6 ఎకరాల్లో కూరగాయల పంటలు పాడైనట్టు వ్యవసాయ సంచాలకులు నివేదించారు. అనంతరం బాలేరు ఆర్‌బీకేలో ఏఏలతో సమావేశమై పంట నమోదుపై సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఏఓ కె.సింహాచలం, అశోక్‌కుమార్, ఏఏలు జ్యోతి, ఎలీసా, దుర్గాప్రసాద్, ఈశ్వరరావు ఉన్నారు.

సర్వేరాళ్లు పాతండి
పార్వతీపురం: జిల్లాలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో మే 15 నాటికి సర్వేరాళ్లు పాతాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. డివిజన్, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సోమవారం మాట్లాడారు. గృహ నిర్మాణాలు ఏప్రిల్ 15 నాటికి పూర్తిచేయాలని, డివిజనల్ మున్సిపల్ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ పక్కాగా చేపట్టాలన్నారు. మానస సరోవరం పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డుమా పీడీ రామచంద్రరావు, హౌసింగ్ పీడీ రఘురాం, డీపీఓ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్


పార్వతీపురం పట్టణం 19వ వార్డు లబ్ధిదారు వెంకటరత్నంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దిలీప్‌కుమార్


సంగంవలస గ్రామంలో లబ్ధిదారు బూరాడ సత్తెమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కె.ప్రియాంక

పార్వతీపురంటౌన్: వైఎస్సార్ పింఛన్‌కానుకుల పంపిణీ పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేయడంలో జరిగిన జాప్యంతో పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. 1,40,940 మంది లబ్ధిదారులు రూ.38.63 కోట్ల పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, తొలిరోజు 11.5 శాతం మేర పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు.

మత్తుపదార్థాల రవాణాపై నిఘా


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో మత్తు, మాదక ద్రవ్యాలపై పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ఆదిలోనే అరికట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల నివారణకు చెక్‌పోస్టు వద్ద నిఘా ఉండాలన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ గిరిజన, గిరిశిఖర ప్రాంతాల్లో గంజాయి సాగుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎక్కడ గంజాయి పంట సాగుచేసినా పోలీసులకు సమాచారం అందించాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ దిలీప్ కిరణ్, డీఎఫ్ఓ ప్రసూన, ఆర్డీఓ హేమలత, డీఎంఅండ్‌హెచ్ఓ జగన్నాథరావు, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి లావణ్య, గిరిజన సంక్షేమ శాఖాధికారి పి.సూర్యనారాయణ, విద్యాశాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రమదానం
పార్వతీపురం మన్యం జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పెద్ద ఎత్తున శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం పట్టణానికి జిల్లా కేంద్రానికి ఉండాల్సిన హంగులన్నీ ఉండాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయం ఆవరణ, పరిసర ప్రాంతాల్లో శ్రమదానం జరుగుతుందన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఉద్యోగులను బృందాలుగా విభజించి ఒక్కో బృందానికి ఒక్కో ప్రాంతాన్ని అప్పగిస్తామని వివరించారు. బాగా పనిచేసిన బృందానికి బహుమతులు అందించే యోచనలో ఉన్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతీవారం శ్రమదానం చేసి కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. ఈ నెల 5న కలెక్టర్ కార్యాలయ ప్రహరీ, గేట్‌లను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు పాల్గొన్నారు.

గురుకులాల్లో టీచింగ్ పోస్టుల భర్తీ


సీతంపేట:

గిరిజన గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ బి.నవ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ ఉత్తీర్ణులై డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఆంగ్ల మీడియంలో చదివి ఉండాలన్నారు. డిగ్రీ 50 శాతం, బీఈడీలో 50 శాతం మార్కులతో పాస్ కావాలన్నారు. ఈనెల 10వ తేదీ లోగా ఐటీడీఏ, గురుకులం సెల్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీటీ ఇంగ్లీష్ - 2, గణితం-2, ఫిజిక్స్-1, టీజీటీ హిందీ, గణితం ఒక్కోపోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. టీజీటీ సైన్సు-2, సోషల్-1, జేఎల్ తెలుగు-2, ఇంగ్లీష్-1, ఫిజిక్స్-1, జువాలజీ-1, పీడీ-1 మొత్తం 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రోస్టర్ విధానంలో భర్తీచేస్తామన్నారు.

విజయీభవ..!

- పదోతరగతి పరీక్షలు ప్రారంభం
- తొలిరోజు ప్రశాంతం
- విద్యార్థులను ఆశీర్వదించిన తల్లిదండ్రులు
- 10,776 మంది హాజరు, 33 మంది గైర్హాజరు

పార్వతీపురం టౌన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 64 కేంద్రాల్లో నిర్వహించిన రెగ్యులర్ పరీక్షకు 10,809 మంది విద్యార్థులకు 10,776 మంది హాజరయ్యారు. 33 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ నిషాంత్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఇతర అధికారులు తనిఖీ చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సరఫరాతో పాటు వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో పక్కాఏర్పాట్లు చేసినట్టు డీఈఓ తెలిపారు. పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.
- ఈ ఏడాది ఎక్కువ పరీక్ష కేంద్రాలను జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఏర్పాటుచేశారు. 9 పరీక్ష కేంద్రాల్లో 1545 మందికి 1541 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అత్యల్పంగా కురపాం, జియ్యమ్మవలస, పాచిపెంట మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఆయా మండలాల్లో శతశాతం (1181 మంది) విద్యార్థులు పరీక్ష రాశారు.
- ఉదయాన్నే ఇష్టదైవాలకు పూజలుచేసి గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తొలిరోజు కావడంతో విద్యార్థుల వెంట తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు వచ్చారు. జాగ్రత్తలు చెప్పి సాగనంపారు. పరీక్షలు చక్కగా రాయాలని ఆశీర్వదించారు.


తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థిని


పార్వతీపురం డీవీఎం పరీక్ష కేంద్రానికి కుమార్తెకు తోడుగా..

- దూర ప్రాంతాల విద్యార్థులకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణసదుపాయం కల్పించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు.
- నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అన్ని కేంద్రాలకు ప్రభుత్వం బెంచీలు సమకూర్చడం, తరగతి గదులను ఆహ్లాదంగా తీర్చిదిద్దడంతో సౌకర్యవంతంగా పరీక్షలు రాసినట్టు తల్లిదండ్రులతో విద్యార్థులు సంతోషంగా చెప్పారు.


పరీక్షకు హాజరైన విద్యార్థులు


రూమ్‌నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

క్లుప్తంగా

8 తులాల బంగారం చోరీ



స్థానికులను విచారణ చేస్తున్న సీఐ అప్పలనాయుడు

మెంటాడ: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో గురువారం రాత్రి ఎనిమిది తులాల బంగారం చోరీకి గురైందని స్థానికురాలు నగరి సన్యాసమ్మ ఫిర్యాదు చేసినట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం రాత్రి గజపతినగరంలోని తన అల్లుడు మక్కువ సత్యంనాయుడు నూడిల్స్ షాపు ప్రారంభానికి ఇంట్లో అందరం వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చే చూసేసరికి బెడ్‌రూం తలుపులు తీసేసి బీరువా తాళం పగులగొట్టి బట్టలు చిందరవందర చేసేసి ఎనిమిది తులాల బంగారం చోరీకి గురైంది. ఈ మేరకు బాధితురాలు సన్యాసమ్మ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడు ఆధ్వర్యంలో క్లూస్‌టీం దర్యాప్తు చేసిందని నిందితుల కోసం గాలింపు చేపడతామని తెలిపారు.

బాలుర పరిశీలన గృహం సందర్శన



బాలుర పరిశీలన గృహాన్ని పరిశీలిస్తున్న ఆర్.జె.ఆనంద్

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని దిశ వన్‌స్టాప్ సెంటర్, కొత్త ధర్మపురిలోని బాలుర పరిశీలన గృహాన్ని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఆర్.జె.ఆనంద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలుర పరిశీలన గృహంలో సౌకర్యాల గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలించి ఏరకమైన కేసులు వస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి, బి.శాంతకుమారి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ విజయలక్ష్మి, డీసీపీయూ అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

- విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 40 ఫిర్యాదులను దిశ డీఎస్పీ ఎం.వెంకటేశర్లుతో కలిసి ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై ఏడు పనిదినాల్లో సమస్యలను పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అలాగే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎస్పీ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ సీహెచ్.రుద్రశేఖర్, డీసీఆర్బీ ఎస్సై వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

లీగల్ గార్డియన్ ధ్రువపత్రాల పంపిణీ

విజయనగరం అర్బన్: జాతీయ ట్రస్ట్ చట్టం 1999 కింద పలువురికి లీగల్ గార్డియన్ ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ ఎ.సూర్యకుమారి అందజేశారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పల్లి వెంకటరమణ, ఎస్.వెంకటసూర్యశ్రీనివాసరావు, సీరపు వెంకటలక్ష్మి, గంటా శ్రీనివాసరావులకు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జీవీబీ జగదీష్ పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

ఎండన పడకుండా జాగ్రత్త..!

- ఒంటిపూట స్కూల్స్ వేళ బహుపరాక్
- పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమంటున్న వైద్యులు



ఒంటిపూట బడి కావడంతో విద్యార్థుల హడావిడి



వాహనంపై విద్యార్థిని స్కూల్‌కు తీసుకెళ్తున్న తల్లి



స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థి

విజయనగరం: వేసవి దృష్ట్యా..పాఠశాలలకు ఒంటిపూట తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం సెలవులు కావడంతో పిల్లలు ఆటలాడేందుకు బయటకు వెళ్తుంటారు. ఒక్కోసారి ఆనందం వెంటే విషాదాలు పొంచి ఉంటాయని తల్లిదండ్రులు గ్రహించాలి. ఒంటిపూట బడుల సమయంలో పాఠశాలకు వెళ్లే పిల్లలు సరదాలకు అలవాటు పడతారు. తల్లిదండ్రులు ఎంత వారించినా ఇంటిపట్టున ఉండేందుకు సుముఖత చూపరు. ఇంట్లో చెప్పకుండా సరదా కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువ. మరోవైపు వేసవి కావడంతో ఎండలో తిరగడం వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదముంది. ఒంటిపూట బడులు పిల్లల ఆరోగ్య రీత్యా విద్యాశాఖ ఇచ్చిన వెసులుబాటు అని తల్లిదండ్రులు గ్రహించాలని వైద్యులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులకు వైద్యులు సూచిస్తున్న సలహాలు ఇలా ఉన్నాయి.

గుండె చెరువు కాకుండా..ఉండాలంటే..

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చెరువులు, బావుల్లో పెద్దలు లేకుండా ఈతకు వెళ్లనీయదు.
- ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై మోజుతో ఇంట్లో చెప్పాపెట్టకుండా రోడ్డెక్కితే ప్రమాదాల బారిన పడే ఆస్కారముంది.
- బడి వదలగానే కొందరు పిల్లలు సమయం దొరికిందని ఎండలో ఆటలాడుతారు. ఫలితంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది.
- పాఠశాల నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చాక చిన్నారులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి. నీతి కథలు, స్ఫూర్తిగాథలు చదివే విధంగా ప్రోత్సహించాలి. తద్వారా చిన్నారులు ఇంటి పట్టున ఉండే అవకాశం ఉంది. అవసరమైతే నీడ పట్టున ఆడుకునే ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలనే చెప్పాలి. చదరంగం, క్యారమ్స్ వంటి ఆటల్లో ప్రోత్సహించాలి.

వడదెబ్బ నుంచి బయటపడటం ఇలా..

వేసవిలో శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నప్పుడు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. దీంతో భౌతికంగానే కాకుండా శరీరంలో వివిధ అవయవాలు, నాడీ వ్యవస్థ ప్రమాదానికి గురై ఒక్కోసారి పిల్లలు, పెద్దలలోనూ గుండెపోటు వచ్చే ప్రమాదముంది. ఇలాంటి సమయంలో వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఎక్కువ ఉష్ణోగ్రత పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలలో నీరు తాగితే మూత్రవిసర్జన చేయాల్సి వస్తుందని పిల్లలు నీరు తాగరు. దీని వల్ల డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదముంది. వేసవిలో రోజూ కనీసం 8 గ్లాసుల నీరు తాగేలా చూడాలి.

పాఠశాలకు వెళ్లే, వచ్చే ముందు..

- ఉదయం 8 గంటలలోగా పిల్లలకు స్నానం చేయించాలి. పల్చని దుస్తులు వేయాలి.
- పాఠశాలకు వెళ్లే సమయంలో కళ్లద్దాలు, సన్‌స్క్రీన్ లోషన్లు వాడాలి. పిల్లల సంచిలో నీళ్ల సీసా ఉండేలా చూడాలి.
- పాఠశాల నుంచి బయటకు వచ్చే సమయంలో ఎండ తగలకుండా గొడుగు, తలకు టోపీ, క్లాత్ ఏదో ఒకటి కప్పి తీసుకురావాలి. లేదంటే పిల్లలు నీరసించిపోతారు దీంతో తలనొప్పి రావచ్చు.
- ఆరేళ్లలోపు పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలి. శరీర ఉష్ణోగ్రత పెరిగిన వెంటనే వారికి ఫిట్స్ వచ్చే ప్రమాదం ఎక్కువ.
- ఎండలో నుంచి ఇంటికి రాగానే ఫ్రిజ్‌లోని చల్లని నీరు, శీతల పానీయాలు తాగొద్దు. మట్టితో తయారుచేసిన కుండలోని చల్లటి నీటిని మాత్రమే తాగాలి.
- పుచ్చకాయలు తినిపించడం, పండ్ల రసాలు, కొబ్బరిబొండాలు తాగించాలి. కీరదోస, క్యారట్, బీట్‌రూట్ లాంటి పచ్చి కూరగాయలను తినిపించాలి.

కలుషిత నీరు తాగొద్దు

కలుషిత నీరు తాగితే జీర్ణకోశ సమస్యలు వచ్చే ప్రమాదముంది. కడుపునొప్పి, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు వస్తాయి. కలుషితమైన, శుభ్రతలేని ఆహారం తీసుకోవడం వల్ల హానికరమైన సూక్ష్మజీవుల కారణంగా పిల్లల్లో ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదముంటుంది.

వేసవిలో వచ్చే ఇన్ఫెక్షన్లు

- చమట వల్ల ఎగ్జిమా, దురద, సెగగడ్డలు వంటి అనేక చర్మ సమస్యలు తలెత్తి జ్వరాలు రావొచ్చు. పిల్లలకు చమట ఎక్కువగా పట్టినప్పుడు శుభ్రమైన గుడ్డతో తుడిచి తేలికపాటి దుస్తులు వేయాలి.
- వేడిమి వల్ల ఒక్కోసారి ముక్కు నుంచి రక్తం కారుతుంది. ముక్కులో వేలుపెట్టే అలవాటు ఉంటే ఎక్కువ ప్రమాదం.
- పిల్లల్లో ఈ కాలంలో కళ్లకలక వ్యాపిస్తుంది. దుమ్ముధూళి, వేడి వల్ల కంటి ఇన్ఫెక్షన్లు త్వరగా వస్తాయి.

పిల్లలను బయటకు పంపొద్దు

ఒంటిపూట బడి వదలగానే మధ్యాహ్నం వేళ పిల్లలను అవసరమైతే తప్ప బయటకు పంపొద్దు. ఈ సమయంలో వీలును బట్టి తల్లిదండ్రులు పిల్లలతో గడిపేందుకు అధిక సమయం కేటాయించాలి. ఇంటి పట్టున ఉండేలా పిల్లలకు వారి హోంవర్క్‌లో సాయం చేస్తూ వారిని ప్రోత్సహించాలి.

– కె.శ్రీనివాసరావు, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, సీహెచ్‌సీ, నెల్లిమర్ల

బాలల సంక్షేమానికి ప్రభుత్వ పథకాల అమలు

- జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్

విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్‌లో బాలల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఆర్.జె.ఆనంద్ తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోది ఆలోచనలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సహకారం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. డ్రగ్స్ బారిన పడి పిల్లలు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, డీఆర్వో గణపతిరావు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ హిమబిందు, డీసీపీయూ అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫైబర్ బోటు దగ్ధం

- సుమారు రూ.20లక్షల ఆస్తినష్టం



కాలిపోయిన బోటును పరిశీలిస్తున్న మత్స్య, రెవెన్యూ శాఖ అధికారులు

భోగాపురం: మండలంలోని చోడిపిండిపేట గ్రామ సమీప సముద్ర తీరంలో లంగరు వేసిన ఫైబర్ ఇంజిన్ బోటు ఆదివారం అర్ధరాత్రి దగ్ధమైంది. దీనిపై మత్స్యశాఖ, రెవెన్యూ, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎరుపల్లి పోలేష్ తనకున్న ఫైబర్ బోటుతో ప్రతిరోజూ సముద్రంలో చేపలవేట సాగిస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తోటి మత్స్యకారులతో కలిసి సముద్రంలోకి వేటకు వెళ్లాడు. మళ్లీ వేట ముగించుకుని సాయంత్రం 4 గంటలకు బోటును సముద్రంలో లంగరు వేసి తోటి మత్స్యకారులతో కలిసి ఇంటికి చేరుకున్నారు. అర్ధరాత్రి సమయంలో సముద్రంలో లంగరు వేసిన బోటు నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు బోటు యాజమాని పోలేష్‌కు సమాచారం అందించడంతో తోటి మత్స్యకారులను తీసుకుని సముద్రంలోకి వెళ్లి మంటలను అదుపుచేసి కాలిపోయిన బోటును ఒడ్డుకు చేర్చారు.

రూ.20 లక్షల ఆస్తి నష్టం

విషయం తెలుసుకున్న మత్స్యశాఖ ఎఫ్‌డీఓ చాందిని, వీఆర్‌ఓ లక్ష్మి, రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను బాధితుడిని అడిగి తెలుకున్నారు. కాలిపోయిన బోటుతో పాటు వలల విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. బాధితుడు పోలేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

క్షేత్రసహాయకుడి నియామకంపై విచారణ చేపట్టండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వెల్దూరు గ్రామస్తులు

పూసపాటిరేగ: ఉపాధి హామీ పథకానికి సంబంధించి మండలంలోని వెల్దూరు ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమితుడైన తిప్పలవలస గ్రామానికి చెందిన మూగి దానయ్య నియామకంపై విచారణ చేపట్టాలని వెల్దూరు గ్రామానికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఇ. భాస్కరరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, దానయ్య తప్పుడు ధ్రువపత్రంతో ఉద్యోగం పొందాడని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా గ్రామానికి చెందిన వ్యక్తినే నియమించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దారపు అప్పలసూరి, దారపు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం దిశగా స్పందన దరఖాస్తులు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

పార్వతీపురం: స్పందన కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట్రావు ప్రజల నుంచి 80 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ. ఈశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, పీఆర్ ఎస్ఈ ఎంవీఆర్ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఒ.ప్రభాకర రావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డీఈఓ ఎస్‌డీవీ రమణ, డ్వామా పీడీ కె.రామ చంద్రరావు, గ్రామ/వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టిబాబు, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.డి.నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, జిల్లా మలేరియా అధికారి కె.పైడిరాజు, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎ.లావణ్య, జిల్లా రవాణా అధికారి ఎం.శశి కుమార్, జిల్లా ప్రధాన అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు, జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్, క్రీడల చీఫ్‌కోచ్ ఎస్.వేంకటేశ్వర రావు, జిల్లా రిజిస్ట్రార్ ఎం.ఎస్.కె.పూర్ణచంద్, జిల్లా ఉద్యాన అధికారి కేవీఎస్ఎన్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి పి. సీతారాం తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట గడువులోగా సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ

పార్వతీపురంటౌన్: స్పందన వినతులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 14 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. పోలీసు అధికారులు వారి పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్‌డీఎస్పీ బి. నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎన్వీ ప్రభాకర్, ఎస్సై పి.దినకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 199 వినతులు



అర్జీలను అందుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: కలెక్టర్‌రేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 199 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 140 ఉన్నాయి. హౌసింగ్‌కు 12, మున్సిపల్ శాఖ 6, వైద్య శాఖ 3, డీఆర్‌డీఏ 17 కాగా మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు, పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై ఉన్నాయి. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌డీఏ ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మలత, సూర్యనారాయణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

సచివాలయ సిబ్బందికి మరోసారి శిక్షణ

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో పరిష్కారం కావాల్సిన అనేక వినతులు జిల్లా స్థాయికి వస్తున్నాయని, సచివాలయ సిబ్బందికి మరోసారి శిక్షణ నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించాలని సూచించారు. సంబంధిత శాఖ హెచ్‌ఓడీ శిక్షణలో పాల్గొని శాఖా పరమైన అంశాలపై ఇతరులకు అవగాహన కలిగించాలన్నారు.

మానవత్వం చాటుకున్న ఉపముఖ్యమంత్రి

- ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- వైద్యులు, పోలీసులను ఫోన్‌లో అప్రమత్తం చేస్తూ పర్యవేక్షణ



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర మానవత్వం మరోసారి చాటుకున్నారు. ప్రాంతం కాదు ప్రాణం ముఖ్యమని వైద్యారోగ్య, పోలీసుశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన కూలీలు ఆంధ్రా నుంచి ఒడిశా మీదుగా ఛత్తీస్‌గఢ్ వైపు జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్‌హైవే రోడ్డు పనులు చేస్తున్నారు. అయితే వారు ఎప్పటిలాగానే సరుకుల నిమిత్తం ఒడిశా నుంచి సాలూరు వచ్చారు. సరుకులు కొనుగోలు చేసుకుని సాలూరు నుంచి ఒడిశాకు ఆదివారం రాత్రి వ్యాన్‌లో వెళ్తుండగా లావుడి గ్రామం దాటిన తరువాత బ్రేక్‌ఫెయిలై వ్యాన్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. రాత్రిపూట కావడంతో సకాలంలో వైద్య సేవలు అందక హాహాకారాలు చేశారు.కాగా విజయవాడ వెళ్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు ఫోన్‌ద్వారా విషయం తెలియడంతో ఆయన వెంటనే స్పందించారు. ప్రాంతంకాదు ప్రాణం ముఖ్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు, పోలీసులను ఫోన్‌లో అప్రమత్తం చేసి నాలుగు అంబులెన్స్‌లు ఏర్పాటు చేయించి, క్షతగాత్రులను సాలూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రమాదంలో విశ్వాక్ మండల్, జుగాల్‌హస్తలు మరణించారు. ప్రస్తుతానికి సాలూరు ఏరియా ఆస్పత్రిలో ముగ్గురు చికిత్స పొందుతుండగా, తీవ్రగాయాల పాలైన 8 మందిని విజయనగరం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను మృతుల కుటుంబాలకు సోమవారం అప్పగించారు. ఈ సంఘటనపై ఒడిశా పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్ మృతి



లారీలో ఇరుక్కున్న మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

రామభద్రపురం: మండలకేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద సోమవారం వేకువజామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా కేంద్రంలోని ఏటకన్నరెడ్డి కాలనీకి చెందిన గొగ్గులోతు రాము అలియాస్ రాములా నాయక్ (53) అదే జిల్లాలోని మటంపల్లి నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడుతో సాలూరు పట్టణానికి వస్తున్నాడు.సరిగ్గా పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి ముందు ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టడంతో డ్రైవర్ రాము ముందుకు తూలిపోయి స్టీరింగ్, బాయినెట్ మధ్య ఇరుక్కుపోయి అక్కడిక్కడే మృతిచెందాడు. స్టీరింగ్‌కు బాయినెట్ మధ్య ఇరుక్కున్న మృతదేహాన్ని జేసీబీ సహాయంతో అతి కష్టంమీద తీయాల్సి వచ్చింది. అలాగే ముందున్న లారీ బాయినెట్ కూడా పూర్తిగా పాడైపోయి ఉంది. ఆ లారీ ముందు కూడా గుర్తు తెలియని వాహనం ఉంది. ఆ లారీ డ్రైవర్ పరారవడంతో పూర్తి సమాచారం తెలియరాలేదు. పరారైన లారీ డ్రైవర్ పట్టుబడితే గాని అసలు విషయం తెలియరాదని పోలీసులు చెబుతున్నారు. ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..



ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం వాసవి కల్యాణ మంటపం సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై జి.శిరీష సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని స్థానికులు గమనించి 108కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో వెంటనే గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. వీర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9121109431, 9121109463 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కర్బూజా తోటలో ఘీం'కరి'ంపు

- లబోదిబోమంటున్న రైతులు



జియ్యమ్మవలస: కర్బూజా తోటలో తిష్ట వేసిన ఏనుగులు



భామిని:తాలాడ సమీపంలో తిరుగాడుతున్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం –బిత్రపాడు పరిసర పంటపొలాల్లో ఉన్న కర్బూజా తోటలో మూడురోజుల నుంచి ఏనుగులు తిష్ఠ వేశాయి. సోమవారం ఉదయం రైతులు పంట పొలాలకు వెళ్లి చూసేసరికి కర్బూజా కాయలు ధ్వంసం కావడంతో రైతులు లబోదిబోమమంటున్నారు. అటవీశాఖాధికారులు ఏనుగులను చూడడమే తప్ప తరలించే ప్రయత్నం చేయక పోవడంతో వారంతా అసహనం వ్యక్తం చేశారు. సంబంధితలధికారులు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెరుగుతున్న గజరాజుల విధ్వంసం

భామిని: మండలంలో రెండు ఏనుగుల గుంపు సంచారంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం రెండు ఏనుగుల గుంపులు పంట పొలాల్లోకి దిగి కొంత మేరకు తినివేసి, మరికొంత పంటను ధ్వంసం చేసి వెళ్లాయని రైతులు వాపోతున్నారు. తాలాడ ఐలమ్మ తోట లోగల 4 ఏనుగుల గుంపు, పక్కుడుభద్ర జీడితోటలో తిష్ఠ వేసిన 6 ఏనుగుల గుంపు విధ్వంసంతో పంట నష్టాలు పెరుగుతున్నాయి. పక్కుడు భద్ర వద్ద తిష్ఠ వేసిన ఏనుగుల గుంపును కొందరు రైతులు రాత్రి పూట తరలించడానికి చేసిన ప్రయత్నాలు మిగతా రైతులకు కష్టాలు తెచ్చాయి. వంశధార వరద గట్టు మీదుగా కాట్రగడ రైతులు ఏనుగులను తరలించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నేరడి, గురండి, బిల్లుమడ గ్రామాల వరకు చేరుకున్న ఏనుగులు ఆకస్మికంగా వెనుదిరిగాయి. నేరడి, గురండి రైతులకు చెందిన పంటలను తినివేస్తూ వెనుదిరిగాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

■ విజయనగరం, శ్రీనివాసనగర్, మెహర్‌బాబా టెంపుల్ దగ్గర, వరుణ్ మారుతీ వెనుక శ్రీగాయత్రిసదన్ S-6, 1200 SFT, 2BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. Cell : 98496 43347. [S-1154269]

PLOT FOR SALE

■ VZM ధర్మపురి road గాయత్రినగర్, 300 sqy. North/West, 30 ft road corner plot for sale. Direct parties only.7989565261. [S-1154264]

ASTROLOGY

■ గాయత్రి జోతిష్యం : విద్య, ఉద్యోగం, వ్యాపారం, వివాహం, సంతానం, ప్రేమ, భార్యభర్తల మధ్య గొడవలు, ఆర్థిక సమస్యలు మీకు ఏటువంటి సమస్యలకైనా శాశ్వత పరిష్కారం చేయబడును. భాష్యం స్కూల్ ఎదురుగా VZM. ఫోన్: 97017 78711 [V- 1538]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్, ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795294]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995365999 [HA-1151]

■ మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లలో అనుభవం ఉన్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. (ప్రాఫిట్‌లో షేర్ ఇవ్వబడును). Mega Group Man Power & Security (AP & TS). Contact : 70326 10569, 70931 25169. [NA-5476]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 16K-18K విజయవాడ. ఫోన్: 9640528899, 9640648899 [H-793409]

■ HPCL కంపెనీ నందు విజయనగరం జిల్లాలో సర్వే చేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం : Weakly Payment కమీషన్ బేసిక్. ఫోన్ : 90109 55341 [V- 776967]

■ హైదరాబాద్‌లోని అప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Ceretakers కావలెను.జీతం:16-18వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్సు గలవు. +91 6300813664 [G-537]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.